క్లుప్తంగా

ఘనంగా మరిడిమాంబ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ కొండయ్యవలస గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి అనుపు మహోత్సవం ఘనంగా జరిపించారు. కొండయ్యవలసతో పాటు పరిసర కాలనీల్లో అమ్మవారి జాతరతో సందడి నెలకొంది. గురువారం తెల్లవారు జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించి, మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని, విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భారీ బాణసంచాతో, సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి అనుపు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌కు సన్మానం



మంత్రి అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఆడారి ఆనంద్ కుమార్ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను 68వ వార్డు మిందిలో గురువారం కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించినందుకు అమర్‌కు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. విశాఖ డెయిరీ డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయానికి ద్వారబంధ పూజలు



ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కుంచుమాంబ, దుర్గమాంబ, ముత్యమాంబ అమ్మవార్ల ఆలయాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. శ్రీ దుర్గమాంబ అమ్మవారి ఆలయానికి ద్వార బంధం ఏర్పాటులో భాగంగా గురువారం ద్వార బంధ పూజలు చేశారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ద్వార బంధాన్ని ఎత్తారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

పెదగంట్యాడ: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ అధికారి శ్రావణి సూచించారు. కుశాల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రాగి పిండితో చేసే పదార్థాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సుశీల, భవాని, త్రివేణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సెట్విస్ భవనం



రాంనగర్‌లో శిథిలావస్థలో ఉన్న సెట్విస్ భవనం



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న భవనంలో ఓ భాగం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లో సర్వీసు రోడ్డు పక్కన భవనం శిథిలమై, ప్రమాదకరంగా ఉంది. సుమారు 35 సంవత్సరాల క్రితం అక్కిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో రాంనగర్‌లో సుమారు వెయ్యి గజాల విస్తీర్ణంలో 17 షాపులుగా నిర్మించి ఎస్సీ డెవలప్‌మెంట్ ఇన్ ఎడ్యుకేషన్, ట్రైనింగ్, ఎంప్లాయిమెంట్ ద్వారా ఉపాధికల్పనకు అర్హులైన ఎస్సీలకు సెట్విస్ అధికారులు షాపులను కేటాయించారు. అప్పట్లో ఎవరికైతే షాపులను కేటాయించారో, వారిలో ఒకరిద్దరు మినహా మిగిలిన వారంతా షాపులపై భారీ అడ్వాన్సులు పొంది, ఎక్కువ అద్దెలకు ఇచ్చి లబ్ధిని పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరినా వ్యాపారాలు నిర్వహించడంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుపాను సమయంలో భవనం కూలిపోయే ప్రమాదం ఉందని, నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో జరగరానిది జరిగితే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. సెట్విస్ అధికారులు నెలవారీ అద్దె ఠంచనుగా వసూలు చేయడమే తప్ప, భవనం పరిస్థితిని గానీ, కేటాయించిన వారే వ్యాపారాలు నిర్వహిస్తున్నారా అనే విషయాలేవీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంతవాసులు కోరుతున్నారు.

మంత్రి మూర్తి కుటుంబానికి విజయసాయిరెడ్డి పరామర్శ



మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి మూర్తి అకాల మరణం కార్మిక లోకానికి తీరని లోటని రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అన్నారు. నడుపూరులోని మంత్రి మూర్తి నివాసానికి గురువారం వెళ్లిన ఎంపీ విజయసాయిరెడ్డి, ఆయన సోదరులు మంత్రి రాజశేఖర్, శంకర నారాయణలను.. తల్లి, భార్య, కుమారుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, వై.మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పరికరాల పంపిణీ



కార్మికులకు పరికరాలు అందిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు అవసరమైన పరికరాలను కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి గురువారం అందజేశారు. దల్లివానిపాలెంలోని శానిటరీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులకు చీపుర్లు, కర్రలు, బ్లీచింగ్, చేతి గ్లౌజులు, గమ్ బూట్లు, మాస్కులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు,

‘స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించం’



756వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు కార్మికులు

కూర్మన్నపాలెం: ఉక్కు పోరాట యోధుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే, చూస్తూ సహించబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 756వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు నేటికీ దీనస్థితిలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటే మంచిదని హితవు పలికారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించాలని, లేదంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమి పూజ



సమావేశంలో మాట్లాడుతున్న గంగవరం పోర్టు సీఈవో గాంధీ

పెదగంట్యాడ: అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 64వ వార్డు దిబ్బపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో రూ.10లక్షలతో నిర్మించనున్న డైనింగ్ హాల్ నిర్మాణ పనులకు గంగవరం పోర్టు సీఈవో బీజీ గాంధీ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, పోర్టు ప్రతినిధులు నందూరి సాంబశివరావు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 24 మంది..

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు విశాఖ జిల్లా తరఫున పాల్గొనే మహిళ, పురుష జట్లకు 24 మంది ఎంపికయ్యారు. మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌లో ఎంపిక పోటీలను గురువారం మధ్యాహ్నం సంస్థ చైర్మన్ ఎమ్.మోహన్‌కృష్ణ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా పోటీలు జరిగాయి. వీరిలో 12 మంది చొప్పున పురుష, మహిళ జట్లను అబ్జర్వర్, ఎన్ఐఎస్ కోచ్ కె.చిట్టిబాబు పర్యవేక్షణలో ఎన్ఐఎస్ కోచ్‌లు కె.కావ్య, ఐ.చరణ్ ఎంపిక చేశారు. 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ వుమెన్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి పి.త్రినాథ్ తెలిపారు.

రాష్ట్ర జట్లు ఇవే ..

రాష్ట్ర స్థాయి పోటీలకు మహిళల జట్టుకి కె.లిఖిత, బి.రాజేశ్వరి, ఎస్.లహరి, డి.శృతిప్రియ, పి.ప్రసన్న, సీహెచ్.సాయిప్రభ, ఇ.జ్ఞానేశ్వరి, టి.లిఖిత, ఎ.జాహ్నవి, ఎమ్.జ్యోత్స్న, ఎస్.జ్యోతి, ఎస్.పూజిత ఎంపికయ్యారు. పురుషుల జట్టుకి ఎ.సంపత్, ఆకాశ్ వర్ధన్, ఎమ్.జోయల్ యశ్వంత్ కుమార్, జి.రుత్విక్, వి.దిలీప్ కుమార్, కె.కార్తీక్, కె.శివశంకర్, ఎ.జీవన్, వి.పూర్ణచంద్ర ప్రసాద్, ఎస్.రాజేష్, ఎస్.సత్యనారాయణ, కె.మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు.

కిడ్నీ సమస్యలపై అవగాహన అవసరం



జాగ్రత్తలను వివరిస్తున్న జెడ్సీ సింహాచలం

కూర్మన్నపాలెం: కిడ్నీ సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) సౌజన్యంతో 87వ వార్డు తిరుమల నగర్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో తిరుమలనగర్‌కు చెందిన సుమారు 250 మంది పాల్గొని, రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమానికి గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం, కార్పొరేటర్ బొండా జగన్నాథం, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, ఏఎంహెచ్‌వో కిరణ్ కుమార్, ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రవర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ రవీంద్రవర్మ మాట్లాడుతూ జబ్బు రాకముందే జాగ్రత్త పడాలన్నారు. ముఖ్యంగా గుండె జబ్బులు, మధుమేహం, కిడ్నీ సమస్యలు ఉన్నవారు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కిడ్నీ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎన్‌యూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ సాప్లే, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీధర్, నెఫ్రాలజీ డాక్టర్ వాణి, మార్కెటింగ్ మేనేజర్ అనిల్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.30లక్షల పరిహారం



మృతుని కుటుంబ సభ్యులకు పరిహారం అందజేస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి, రాజు

పెదగంట్యాడ: మృతుని కుటుంబానికి కంపెనీ యాజమాన్యం పరిహారం అందించి, ఆదుకుంది. వివరాలివి.. జీవీఎంసీ 77వ వార్డు మురుభాయ్‌కు చెందిన మేడిశెట్టి పైడిరాజు స్మైలాక్స్ లాబొరేటరీస్ లిమిటెడ్‌లో పని చేసేవారు. పైడి రాజు గత జనవరి 5న ల్యాబ్‌లోని ఓ ఎత్తయిన ప్రదేశంలో పెయింటింగ్ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ రాజు, కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి చొరవ తీసుకుని సంస్థ యాజమాన్యంతో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.30లక్షలు పరిహారం చెల్లించేలా ఒప్పించారు. ఈ మేరకు రూ.30లక్షల చెక్కును మృతుని భార్య మహాలక్ష్మికి మేనేజర్ లక్ష్మణరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కె.శివకుమార్, అప్పలరెడ్డి, అప్పారావు, దేముడు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

గాజువాక : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ మొదటి ర్యాంకు సాధించే విధంగా శానిటరీ విభాగం సిబ్బంది కృషి చేయాలని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఔట్‌సోర్సింగ్ శానిటరీ సూపర్‌వైజర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది జీవీఎంసీ నాలుగో ర్యాంకు సాధించిందని, ఈసారి మొదటి ర్యాంకు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. అన్ని విభాగాల్లోనూ ఉత్తమ ప్రతిభ చూపే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి శాంతిధామంలో వార్షిక వేడుకలు



మండప అర్చనలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామం 9వ వార్షికోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఈ నెల 8న ప్రారంభమైన వేడుకలు 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో గురువారం కాకడ హారతి, ధునిపూజ అనంతరం సర్వతోభద్ర మండప, నవగ్రహ మండప అర్చనలు చేశారు. పూజల్లో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 10న రథోత్సవం, 11న సంకీర్తనలు, అర్చనలు, హోమాలు, 12న ఏకాదశ రుద్రాభిషేకం, చక్కెరాభిషేకం జరిపించనున్నట్లు తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన, సాయంత్రం పరస ఉంటాయన్నారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సాయిబాబాను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



అప్పలరాజు (ఫైల్)

అగనంపూడి: అప్పుల బాధ తాళలేక రైలు పట్టాలపై ఒక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు. దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ శాంతారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దువ్వాడ సెక్టార్–1కు చెందిన కణితి అప్పలరాజు (35) సెలూన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఇదే జీవనాధారంగా కుటుంబపోషణ చేసుకొంటున్న అప్పలరాజుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గురువారం ఉదయం దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఈస్ట్ కోస్ట్ వచ్చే సమయానికి రెండో ప్లాట్‌ఫాంపై నుంచి పట్టాలపై దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరం మధ్యభాగంపై రైలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ శాంతారావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అంతటా ప్రచార హోరు



ఆటోనగర్ పారిశ్రామికవేత్తలతో ఎంపీ జీవీఎల్



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్ వద్ద ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్



న్యాయవాదులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ



ఉపాధ్యాయులకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలు సమీపించడంతో ప్రచారాలు హోరెత్తుతున్నాయి. పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా నాయకులు ప్రచారాల్లో నిమగ్నమయ్యారు. గృహాలతో పాటు విద్యాలయాలు, కార్యాలయాలకు వెళ్లి పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్నారు.

ఉక్కులో సీతంరాజు సుధాకర్ ప్రచారం

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటువద్ద గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ఉక్కు ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచారం

బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు విద్యా సంస్థల్లో, న్యాయస్థానంలో గురువారం ప్రచారం చేశారు. సుప్రీంకోర్టు న్యాయవాది కె.మల్లికార్జునమూర్తి ఆధ్వర్యంలో నాయకులు న్యాయవాదులను కలిసి ప్రచారం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మధుకర్, గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 72వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాతకర్ణవానిపాలెంలో ప్రచారం చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎస్.వాసు ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, వాసవి నాయుడు, భవాని తదితరులు పాల్గొన్నారు.
- 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిశారు. తమ మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు. నాగేశ్వరరావు, బొండా అప్పారావు, రెడ్డి జగన్నాథం పాల్గొన్నారు.

గాజువాకలో రమాప్రభ ప్రచారం

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ గాజువాక ప్రాంతంలో గురువారం ప్రచారం చేశారు. సీపీఎం, సీపీఐ నాయకులతో కలిసి ఆమె గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లోని న్యాయవాదులు, జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఉద్యోగులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కలిసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అక్కిరెడ్డిపాలెం, మింది జిల్లా పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులను గురువారం సాయంత్రం కలిసిన ఆయన, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన సూకరాజు, గొంతిన వెంకటలక్ష్మి, నేలపాటి సత్యవతి, సంబారు రాజు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను కలిసిన ఎంపీ జీవీఎల్

ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలను కలిశారు. ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశ్రామిక వేత్తలు ఎంపీ దృష్టికి ఆటోనగర్ సమస్యలను తీసుకువెళ్లారు. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఉపాధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, కార్యదర్శి డి.వినోద్, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: 79వ వార్డు ప్రశాంతినగర్, శనివాడ, పాత అగనంపూడిల్లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు సమర, మామిడి శ్రీను, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారం

ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ మద్దతు అభ్యర్థిగా బరిలో నిలిచిన వేపాడ చిరంజీవిని గెలిపించాలని కోరుతూ దువ్వాడ సెక్టార్–1లో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు.

కూర్మన్నపాలెం: 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని తిరుమల నగర్, దువ్వాడ సెక్టార్లలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి, కరపత్రాలను పంపిణీ చేశారు.

- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 87వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వడ్లపూడి, కణితి సంతమామిడితోట తదితర ప్రాంతాల్లో ఓటర్లను కలిసి, కరపత్రాలను అందజేశారు. ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్ తదితరులు పాల్గొన్నారు. బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని కలిసి, కరపత్రాలను అందజేశారు.

75వ వార్డులో..

పెదగంట్యాడ: 75వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని సిద్దేశ్వరం, సీతానగరం, ఎస్సీ కాలనీల్లో ప్రచారం చేపట్టారు. మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వర రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

అగనంపూడి: విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పులు రావాలని బోట్ రోబోటిక్స్ అధినేత ఎం.చైతన్య, బోట్ ఫోర్స్ రోబోటిక్స్ కో ఫౌండర్ కె.హెచ్.వి.రాజేష్ అన్నారు. కొత్త ఆలోచనలతో వినూత్నంగా ముందుకు వెళ్లాలని సూచించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని విజ్ఞాన్ పాఠశాల 8, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోబోటిక్స్ వీడియోలను ప్రదర్శించి, అవగాహన కల్పించారు. విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపారవేత్తలుగా, పారిశ్రామివేత్తలుగా ఎదగాలంటే ఆ దిశగా ఆలోచనలు సాగించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.